పెద్దకథ

# దేముడా నా దేశాన్ని రక్షించు



బలివాడ కాంతారావు

ఈ గ్రామం రావటం యిది తొలిసారి కాదు. దూరాన వుండటంవలన యీసారి ఐదేళ్ళు దాటాక మళ్ళీ వచ్చాను. అరవయి పడిలో పడిన నేను యీ గ్రామంలో పుట్టి, పదేళ్ళవరకు యిక్కడే గడిపాను. పట్నంలో కాలు పెట్టినప్పుడు తొలిసారి కారెక్కినంత సంబరపడ్డాను. బొంబాయి మహానగరం ఉద్యోగరీత్యా చేరుకున్నప్పుడు మొదటిసారి విమానం యెక్కినట్లనిపించింది. నా జీవితంలోని ఆరు భాగాల్లో ఐదుభాగాలు పట్నాల్లోనూ, మహానగరాల్లోనూ గడచినా, తలచుకొని శరీరం పుల కింప జేసుకోడానికీ, జీవితపు ఒడుదుడుకుల్లో,నిరాశఘడియల్లో శాంతి నిచ్చే అక్కడి యే సంఘటనలూ ప్రయత్నించినా అసలు గుర్తుకు రావటంలేదు. మనిషిగా నాకు నచ్చినట్లు నేను బ్రతకాలనే యీ యేభ యేళ్ళ తాపత్రయంలో, నేనెన్నో సార్లు పరాభవింప బడ్డానన్న భావన నన్ను బాధలో ముంచి వేసింది. ఆ సంఘటనలను సంఘటనలుగా తీసు కుంటే అంత బాధ పడవలసినవిగా తోచక పోవచ్చు. కానీ యీ సంఘటనలను ఒక నియమావళికి అలవడ్డ జీవిత విధానపు దృష్టితో చూడటం వలన మనసు క్రుంగి పోతుంది.

ఉదాహరణకు కొన్ని సంఘటనలను చెప్పకుండా వుండలేను. నలుగురి కన్నాముందుగా నేను రైలు టిక్కెట్ కొన్నవాడిని. నా పేరు వెయిటింగు లిష్టులో వుంది. నాకు కాకుండా నా తరువాత వచ్చిన వాళ్ళు దర్జాగా స్లీపరులో ప్రయాణం చేస్తున్నారు. నేను అదే ట్రెయి నులో ఒక కిక్కిరిసిన సాదా పెట్టెలో నిల్చొని ప్రయాణం చేసా నెన్నిసార్లో. నేనూ ఆ పదో పాతికో చాటుగా అందజేస్తే నాకీ యిబ్బంది కలిగేది కాదు.


నాకు అబ్బాయి ఒక్కడే. వీడు పుట్టి పెరిగిన వాతావరణం వేరు తెలివితేటలున్నా ఒకసారి పరీక్షలో కాపీచేసి రాస్తానన్నాడు. ఎంచేతంటే తన ఫష్టురాంకు పోతుందట ఎలా పోతుందంటే తనతో బాహాటంగా పోటీచెయ్యలేని వాళ్ళు కాపీచేసి తన రేంకు దోస్తున్నారని వాడిగోల. ఏది ఏమైనా కాపీ చెయ్యడానికి వీల్లేదని శాసించాను. రేంకు పోగొట్టుకున్న రోజున యింట్లో వాళ్ళమ్మదగ్గర విసవిసలాడుతున్నాడు. ఇంకోసారి స్కాలర్‌షిప్‌కోసం జరిగే పరీక్షలో వుత్తీర్ణుడయ్యాడు. ఇంటర్వ్యూ వుంది. ఈ యింటర్వ్యూలు కావలసిన వాళ్ళకు సహాయ పడడానికి ఆయుధాలుగా కొందరు వాడుకోవడంకద్దు. మావాడూ ఫలానా వాళ్ళు యిలా వాడుకుంటున్నారు, మీరెందుకు వాడకూడదని అడిగాడు. ఎప్పుడూ యిలా ఆలోచించక అని కేకలేసాను. వీడికి మెరిట్ స్కాలర్‌షిప్ రాకపోగానే యింట్లో తిరగబడ్డాడు. వాడికి డాక్టరు కావాలని వుంది. ఉన్నవాళ్ళదగ్గర పుచ్చుకుని లేనివాళ్ళకు వుచితవైద్యం చెయ్యాలనీ వుంది. సీటు రావటం యెలా? వాడికి సీటు రానప్పుడు "మీనాన్న వెర్రివాడన్నారట" ఇంటికి వచ్చి అదే మాట అప్పజెప్పాడు. ఎవరో కంట్రాక్టరు మొద్దబ్బాయికి వచ్చింది. ఫలానా హోదాలో వున్నవాడి మేనల్లుడికి వచ్చింది. నేను క్లాసుకు ఫస్టువచ్చాను నా కెందుకు రాలేదంటాడు। అలాంటి అనుమానాలు పెట్టుకోకు. బతక లేవని సముదాయించాను. రెండోయేడువెళ్ళాడు. తనదగ్గరకు వచ్చినేర్చు కున్న ఇద్దరికీ యీసారి సీట్లు వచ్చాయి. తనకు రాలేదు.... తన కన్నా వాళ్ళకు యిరవై మార్కులు తక్కువ వచ్చాయి. నేను యీ దేశం నించి పారిపోతానని కోపంతోనూ వెర్రెత్తిపోయాడు. అయితే ఆ జాతిలో పుట్టక పోయావా అని మందలించాను. ఆ వేళనించీ చదువు కుని యేం చెయ్యాలని చదువు మీద శ్రద్ధ చూపలేదు.

ఇక మా అమ్మాయి. నలుగురూ చక్కని పిల్ల అంటారు. బుద్ధయినపిల్ల. బాగా వంట నేర్చింది. స్టేజీయెక్కి మూడు భాషల్లో అనర్గళంగా మాటాడగలదు. పాడగలదు. కాలేజీ డ్రామాల్లోకూడా పాల్గొనింది. మర్యాదగా మాటాడటం తనసొత్తు. ఈ కూతురిని నలు గురు మెచ్చేటట్లు తీర్చిదిద్దడంలో పుట్టిన దగ్గరనించీ మా దంపతు లిద్దరం కృషిచేసాం. ఆ కృషితో పెరిగిన బిడ్డ. ఎంద రిళ్లల్లో తిరిగి తిరిగి వచ్చాడోగానీ మా యింట్లోనూ కాలు పెట్టాడు. అబ్బాయి ఇంజనీరు. అబ్బాయి తండ్రి డాక్టరు. వాళ్ళకు కప్పేసినంత డబ్బు వుంది. ఇదేవాళ్ళకు సంఘంలో ఒక అంతస్థుమీద కూర్చొబెట్టింది. ఇంట్లో కాలుపెట్టి అమ్మాయిని యిటు తిరుగు అటు తిరుగు, గట్టిగా పాడు, డాన్సు వచ్చునా - యిలా అమ్మాయిని యిన్‌సల్ట్ చేసింది చాలక యెన్నివేలిస్తారని అతగాడు అడిగాడు. వాంతి వచ్చింది. మర్యా దకు వాళ్ళమీద వుమ్మలేక దయచేయమన్నాను. కొడుకుపెళ్ళి పిలుపుకు వచ్చి లక్షన్నర పుచ్చుకున్నానని చెప్పాడు. ఎవరమ్మాయి అన్నాను. పెళ్ళి కార్డుచూడండి అన్నాడు. చూస్తే వీడా? పదేళ్ళలో పదిమేడలు కట్టించిన వాడా అన్నాను. ఇంకా మా అమ్మాయి కోసం సంబంధం నేను వెతుకుతూనే వున్నాను.

ఉద్యోగం కావాలంటే పెద్దివాడ్నయినా పట్టుకోవాలి, పెద్ద మొత్తమయినా ఖర్చు పెట్టాలన్న భావన కొందరిలోనైనా తొలగించా లని ఒకసారి సెలక్షను కమిటీకి పెద్దగా వుండడానికి ఒప్పుకున్నాను. అలా ఒప్పుకుని కోరి బాధలు తెచ్చుకున్నాను. అంత చిన్న ఉద్యోగా లకు అంతపెద్ద రికమెండేషన్లు ఇందులో యెన్ని బోగస్ సర్టిఫికెట్లో. ఎన్నివేలు డబ్బులు చేతులు మారిపోయాయోగానీ న్యాయంగా పోయి నిందలు తెచ్చుకున్నాను. లంచాలు తినేసారని తెలియగానే శరీరం

పట్టుతప్పింది. ఎవరిన్నైతేనమ్మి యెంపికచేసిన వాళ్ళపేర్లు యిచ్చానో వాళ్ళ వాళ్ళ సహాయంతోనే యీ ద్రోహం జరిగింది. ఒక్క నయా పైసా లంచం తినకపోయినా నా పేరు మీదే అంతా జరిగిపోయింది.

అప్పుడే వచ్చిన ఒక కుటుంబీకుడు డబ్బివ్వకుండానే యింకో గేటు నించి కదిలి స్పెషల్ దర్శనం చేస్తుంటే అధికారంలో వున్న మహానుభావుడొకడు అధికార లాంఛనాలతో కదులుతుంటే - పది



గంటలై క్యూలో కుటుంబంతో దైవదర్శనం కోసం నిల్చున్న నాకు దేవుని దగ్గరకు వెళ్ళేసరికి చేతులైనా యెత్త బుద్ధి పుట్టలేదు.

అద్దెయిళ్లల్లో వుండి ఆరు నెలలకు యేదో ఒక మిషమీద అద్దె పెంచే ఆస్థిపరులతో పడలేక ప్రభుత్వం యిచ్చే అప్పుతో ఒక యిల్లు కట్టుకుంటానని సాధక బాధకాలు తెలుసుకోక దిగితే కాలు బయటకు తీస్తేలంచం. లంచం పుచ్చుకోనివాడిని నేను లంచం యివ్వనని భీష్మించుక కూర్చున్నాను. తగువు తెచ్చుకుని చిన్నయిల్లు కట్టుకుంటే నా యింటికి వేసిన ఆస్థిపన్ను, లంచాలు తిని లంచం కట్టిన వాని పెద్ద భవనం కన్నా హెచ్చు. ఇక కోర్టుకు తిరిగే ఓపికా, డబ్బూ లేదు. సీతమ్మవారి శీలం కూడా శంకించే జాతి ఐపోయిందే అన్నదే నా విచారం-కానీ యేం చెయ్యడం ? ఇవన్నీ సామాన్య విషయాలుగా కనిపించవచ్చు కానీ అవి కొన్ని విలువలనూ, స్థిరమైన నడవడికలనూ దైవరూపాలుగా పెట్టుకున్న అదర్శాలను వమ్ము చేస్తున్నాయి.

పట్నాల్లో నివశిస్తూ యిలాంటి బాధల బరువుతో సతమత మయ్యే వాళ్ళు నాలా ఎందరెందరో తప్పక వుంటారు. అన్యాయం అవినీతి. బంధుపక్షపాతం ముమ్మరంగా జాతిలో విహరిస్తున్నప్పుడు వాటికి తలఒగ్గని వాళ్ళను కూడా దండనాధికారులు అలవాటు కొద్దీ అనుమానించటం పరిపాటే. నా సంఘంలో నేను నా న్యాయబుద్ధితో నీతితో కలిసిపోవాలని శాయశక్తులా పనిచేస్తుంటే, నాకు తారసపడి ఆవేదన జెంద నిచ్చే విషయాలెన్నో ?

చాలామంది అంతస్తు అధికారాల ప్రమేయం లేకండా యేదో బాధ పడిపోతున్నట్లు గోల చేస్తున్నారు. ప్రతిపూటకు కడుపెలా నింపుతామని బాధపడ్డవాళ్లు తప్పించి, యింకెవరికీ మొర పెట్టుకునే అధికారం లేదు. ఉన్నవాళ్ళ ఫిర్యాదులే హెచ్చు.

ఎక్కడా ద్వంద్వమే. మోసం యెలాంటి యెత్తులకు యెదిగిందంటే - మ టల్లో, చేతల్లో. విన్నవార్తల్లో చూసే బొమ్మల్లో ఎక్కడా మోసమే! వ్యాపారంలోనేకాదు, వ్యక్తి జీవితంలో ప్రతి అంశమూ మోసం, ద్వంద్వమే. ఏది నమ్మాలో ఏది నమ్మకూడదో తెలుసుకోలేని పరిస్థితి యేర్పడింది. రాజకీయవాదులు ఆడిన ఆటలు ప్రజల్లోనూ ప్రాకి పోయాయి. ఇవి చదరంగం ఆటలుకావు. ఈ ఆటలకు రూల్సులేవు. అలోచించ గలిగిన వాళ్ళను దద్దమ్మలను చేసి చూసేవాళ్ళను. వినేవాళ్ళను గుడ్డి వాళ్ళనీ చెవిటి వాళ్ళను చేసి, వాళ్ళే తెలివైన వాళ్ళనీ మనం అంతా మూఢులం అనీ, చెప్పేకబుర్లల్లోనూ చేసేపనుల్లోనూ రూల్సు లేని ఆటలు ఆడేస్తున్నారు. నోరెత్తితే "మూగవెధవా - వూరుకో" అంటారు. ఆత్మను చంపుకుని తల ఒగ్గిన వాళ్ళంతా నిజానికి మూగ వాళ్ళేమరి. ఆడిన ప్రతి మాటను ఆత్మపరం చేసిన వాళ్ళే వికాసశీలమైన మానవ జాతిలో పుట్టిన వాళ్ళు . ఎందరిని వికాసశీలురుగా బ్రతక నిస్తున్నాం? మనిషి చిన్నతనంలోనే బహుశః నీతిగా బతికే అవకాశం కలుగ జేస్తున్నారేమో? పదేళ్ళ వయసువరకే హృదయానికి హత్తుకున్నవే నిజానికి మనిషి జీవితంలో స్వచ్ఛమైన తల్లిపాలులాంటి సత్తువనిస్తుందనుకుంటాను. న్యాయం నీతి, ధర్మం జీర్ణించుకుని బ్రతికి పసితనం నించి బయట పడిన నించీ ఒక్కొక్క అడుగు ఒక్కొక్క కోరికతో వేస్తూ ఒకే మనిషి రెండుగా చీలిపోవడానికి ఉపక్రమిస్తాడు. ఈ

చీలిక రాకుండా యీ స్ప్రిట్ పర్సనాలిటీ కాకుండా కాపాడుకోవటంలోనే మనిషి ప్రజ్ఞ గొప్పతనం వుంది. ఇలా చీలని వాళ్ళే గొప్ప వాళ్లుగా నిల్చిపోయారు. వాళ్లే సనాతన ధర్మాన్ని, పాలించి, స్వాతంత్ర్యం కోసం పోరాడి, న్యాయాన్ని కాపాడి, ఋషులుగా మానవ జాతిలో మిగిలి పోయారు.

ఇంచుమించు యేభయ్యేళ్ల పట్నవాసంలో పైన యెగురుతున్న రాబందులనించీ, చుట్టూ మూగుతున్న తోడేళ్లనించీ, అన్యాయం అవినీతితో అసభ్యంగా కామలీలలు జరిపే అసాధారణ వేశ్యలనించీ, లంచాల రాకెట్లు, బంధుప్రీతి బాంబులు, నల్ల బజారు నాప్లయ్ మంటలతో వుక్కిరిబిక్కిరి చేస్తున్న ఫాసిస్టుల నించీ తప్పించుకోడానికీ అంతేకాదు నాలో పెరిగిన ఆత్మస్తుతిని ఆత్మ విమర్శగా మార్చుకోడానికి మా గ్రామం రావటం అలవాటు. ఆ చిత్తక్షోభనించి మన శ్శాంతి కోసమే మళ్ళీ ఐదేళ్ల తరవాత వచ్చాను.

## 2

మా తాత కట్టించిన సరంబీయిల్లది. ఆ పీధి మధ్యలో వుంది. ఉత్తరంవేపు ముఖద్వారంతో యెత్తుగా వున్న ఆ యింటి గచ్చు వరండామీద తూర్పు మడమరల్లో నిల్చున్న రెండు టేకుకలప స్థంభాలలోపడమర స్థంభానికి ఆనుకుని కూర్చున్నాను. ఈ స్తంబాలను తరిణి బుచ్చెన్న చెక్కాడు, సూది మొన మోపిన ప్రతిజాగా చిలుకుతో, చిలకలతో, పద్మాలతో, పిట్టలతో నిండివున్నాయ్. విశ్వకర్మ హస్తాలు రూపొందించుకున్న మానవహస్తాలకు శ్రద్ధతో భక్తితో నివాళులర్పించడానికి ఆ స్తంభంవైపు ఒక్కసారి చూస్తే ఆ చేతులు అందవు కాబట్టి ఆ చేతులు చెక్కిన చక్కదనాన్ని ముద్దుపెట్టుకోకుండా వుండలేకపోయాను. ఇంచుమించు యెనభై ఏళ్లయినా యింకా యెక్కడా చెదని చేరనియ్యని శాస్త్రవిజ్ఞానం ఏమిటో మరి?

ఆ స్తంభానికి చేరబడటమే ఒక వరంగా భావించుకున్నాను. చప్పున తరిణి బుచ్చెన్న విగ్రహం నా కళ్ళ యెదట పడింది. వాడి జీవితం గుర్తుకొచ్చింది. వెంటనే నా మనసు తొమ్మిదేళ్ళ వయసుతో వెలుగొందే మనసై పోయింది. నా కళ్ళద్దాలు యెప్పుడు తీసేసానో? నేను యీ నాటి వీధిని చూడటంలేదు. నేను ఆనాడు చూసిన వీధి పరిసరాలు, మనుషులూ కదలుతున్నారు. నేను చూసింది చూసినట్లే చెప్తున్నాను. ఎక్కడా ఒక్కపిసరు అతిశయోక్తులుగానీ, అబద్ధాలుగానీ లేవు. నాటకీయత అంతకన్నాలేదు. అంతానిజం, పూర్తి నిజం. నాలో ఎలాంటి భావం కలిగిందంటే నేను యింకా బతికున్నాను. వాళ్ళంతా ధూళిలో కలిసిపోయారు. కానీ వాళ్ళంతా నాకు మన ఋషులు వదలి వెళ్ళిన బుక్కుల్లాంటి వాళ్ళు. నా ముందు తరాల వాళ్ళు వదలి వెళ్ళిన అజంతా కుడ్యచిత్రాలు. కోణార్క అపూర్వ శిల్పాలు. నా జాతి ఔన్నత్యానికి వారసుడైనట్లే వీళ్ళందరి జీవిత ఔన్నత్యాలకూ నేను వారసుణ్ణి.

ఈ పల్లెలోని వీళ్లే నాకెందుకు కనపడాలి? పట్నాల్లో. మహా నగరాల్లో గడిపిన జీవితం యేమైంది ? ఎంచేత ఆ వాతావరణంలో యెవరూ, యే సంఘటనలూ కనబడలేదు. తొలిసారి తాజ్‌మహల్ చూసినప్పటి వుత్తేజం మలిసారి చూసినపుడు వుండనట్లు యీ పట్న జీవితం చప్పగా యెందుకైపోయింది? బహుశః అక్కడ లేనిదేదో యీ గ్రామంలో నాదీ అనేది వుంది. నన్ను విశాలవృక్షం చేసిన వేళ్ళు యీ గ్రామం మట్టిలో వున్నాయి. పచ్చగా వుండి పళ్ళు కాసె యీ వృక్షాలపై పట్నవాసులే రాళ్ళు రువ్వారనుకుంటాను.

మా ముత్తాత తరం గురించి చాలా విన్నాను. ఆ వ్యక్తుల విశేషాలను గురించి నేను చెప్పదలచుకోలేదు. నా వరకూ వచ్చేసరికి ఆ నోటా యీ నోటా పడి అసలు మాట, అసలు పరిస్థితి సంకరం చెందే అవకాశాలున్నాయి. అంచేత నాకు తెలిసిన వీధి పరిసరాలను, వ్యక్తులను, సంఘటనలను చెప్తున్నాను. తూర్పు-పడమరలుగా వున్న వీధిలో దక్షిణదిశ వేపు ఒకయిల్లు వాసఉంది. దక్షిణవేపు గుమ్మాలున్న ఉత్తరవాసలో భోజనాలు, వంటయిల్లు వుండగా దక్షిణవాసలో పడక గదులు. ఈ వీధిలో వున్నవాళ్ళంతా మా చుట్టాలే. మా అమ్మకన్న వారిల్లు పొరుగునే. మాఅమ్మ ఐదుగురు అన్నదమ్ముల్లో పెద్దవాని కూతురు. ఐదుగురు అన్నదమ్ములకు ఐదుయిళ్ళున్నా ఒకడు తప్పించి నలుగురూ కలిసే వున్నట్లులెఖ్ఖ. వాళ్ళకు కాంతమ్మఅనే ఒక చెల్లెలు వుండేది. తూర్పుకు ఒక జామిచెట్టుతో ఒక యిల్లు వుండేది. అందులో సంగీతం మాష్టారువుండేవారు. అతనూ మా బంధువే.. పడమరవైపుకు వస్తే నదికి మాఇంటికీ మధ్యలో రెండుయిళ్ళు. ఒకటి దక్షిణానికీ యింకొకటిఉత్తరానికీ యెదరెదరవుండేవి. ఉత్తరానికి వున్న యిల్లు చెల్లా ముత్యాలమ్మది. దక్షిణానికి వున్నది నారెమ్మది. నారెమ్మ యింటికీ మా వీధికీ మధ్యలో యెత్తయిన జాగాలో ఒక పెద్ద గుళ్ళచెట్టు వుండేది. ఏటిలో అదేపనిగా మునుగుతున్నమమ్మల్ని పిలవడానికి మా అమ్మ ఆ చెట్టుకింద నిల్చొనే కేక వేసేది. ఉత్తర వాస వెనుకకు రెండే రెండు యిళ్ళు వుండేవి. ఒకటి జాలారి వెంకన్నది. ఆ ప్రక్కది పాలకుండ యెర్రయ్యది. వీళ్ళుకూడా యీ వీధిలో వాళ్ళ క్రిందే లెఖ్ఖ. ఆ కుటుంబాలు యీ వీధిలోనే మసలుతుండేవి.

నేను యిప్పుడు కూర్చున్నగడపలో కూర్చొని చూస్తే తూరుపు వేపు వూరును ఆనుకుని వున్న మా మామిడితోట పచ్చని చిగుళ్ళు కనపడేవి: పడమర వేపు యేరు - దూర దూరాన యిసుక తిన్నెలు, నీలి కొండలు, సరుగుడు వనాలు కనిపిస్తుండేవి. గుళ్ళి చెట్టుక్రింద నిల్చొని దక్షిణానికి చూస్తే చరిత్ర ప్రసిద్ధి కెక్కిన సాలెహుండాం కొండ,



8

వంకలు తిరిగిన వంశధార యేరు, యేటినంటుకున్న పొలాల పచ్చదనం అరటి తోటలూ, యేటి అవతలి ఒడ్డునే వున్న వూరు శివాలయం ప్రత్యక్షమయ్యేది.

ఈ గుళ్ళచెట్టు వుండేచోట ఒక్క వానాకాలంలో తప్ప మిగతా కాలాల్లో దాని క్రింద నిల్చొనో కూర్చొనో హాయిగా కబుర్లు చెప్పుకునేవారు. దక్షిణగాలి వీచి దాని క్రింద యెంత హాయిగా వుండేదంటే వీధిలో యెవరికైనా కోపతాపాలు మోతాదు మించి పెరిగితే కాస్సేపు గుళ్ళచెట్టు క్రిందకు వెళ్ళిరా అని చెప్పేవారు. ఈ గుళ్ళ చెట్టు క్రింద కూర్చొని నేను అటు ముత్యాలమ్మ యింటివేపు, యిటు నారెమ్మ యింటివేపు చూసేవాడిని. ముత్యాలమ్మ యింటివాకిట ఒక ముసలాడు అన్నికాలాల్లోనూ చారబడి వుండేవాడు. ఎప్పుడు చూసినా మారనట్లు ఒక్కలాగే నా కంటికి కనిపించేవాడు. వాడిని సాదోడు అనేవారు. ఆ పండు గెడ్డాం సాధువు గెడ్డంలానే వుండేది. అంత తెలుపు మనిషి మా వూర్లో యింకెవరూ వుండేవారు కారు. కానీ మనిషి యెముకలు కనబడేవి. గోచీతోనే చలికాలంలోనూ వుండేవాడు. అంతదూరంలో నున్న నన్ను పోల్చేసి పిల్చేవాడు. చెవుడా అంటే అదీలేదు. చీమ చిటుక్కుమంటే అర్థరాత్రప్పుడు కూడా వినపడి లేచిపోయేవాడేమో? వాడి దగ్గర ఒక తంబుర వుండేది. దాని మీద తత్వాలు పాడేవాడు. నాకు అవి అర్థం కాకపోయినా వినసొంపుగా వుండేవి ఆ తత్వాలు పాడినప్పుడు వరండాలో పడుకున్న నన్ను మా తాతయ్య లేపేవాడు. చీకటి రాత్రులను వెన్నెలగా, వెన్నెల రాత్రులను పట్టపగల్లా ఆ తంబురస్వరం ఆ తత్వాల మధురం మార్చివేసేవేమో ? ఒకోసారి వెన్నెల వుదయించేది. ఇంకోసారి తెల్లవారిపోయేది. ఉంటే రోజుకోపూట తినేవాడట. లేకపోతే అదీలేదట. కానీ యేదీ ఆశించకుండా వీధి వీధంతనీ వెలుగులో ముంచేసేవాడు.

ఇక నారెమ్మ యింటివేపు యెందుకు చూసేవాణ్ణంటే - ఆ యింటికి తరచు ఒకమనిషి వస్తుండేవాడు. నారెమ్మ ఒక్కర్తేవుండేది. నల్లగా వున్నా యెత్తుగా హుందాగా వుండేది. నాకు గుర్తున్నదంతా ఆమె యెల్లప్పుడూ నీటుగా వుండేదని చెప్పగలను. బాగా దువ్వుకుని నల్లని జుత్తుకు మెట్టవేసుకుని సాధారణంగా యెర్రని పువ్వులు ముడిచేది. తీవైనముక్కుకు యెర్ర పొడులు పొదిగిన నత్తు వుండేది. చేతి నిండుగా యెరుపు గాజులు - సాధారణంగా యెర్ర చీరతోనే చూసేవాడిని. ఎరుపురంగంటే యీవిడకెంత యిష్టమో మరి? ఒక్కోసారి ఆ కళ్ళుకూడా యెర్రగా ఉండేవి. నా కెందు కిష్టమంటే యెర్రటి జీడిపళ్ళు నారెమ్మ తోటలోవి తెచ్చి నన్ను పిలిచి యిచ్చేది. నాకు సువర్ణరేఖ మామిడి పళ్ళంటే యిష్టమని తెలుసుకదా. "సిన్నబాబూ - ఇదిగో సిలక కొరికిన పండు. మారుచిగా వుంటాది - తిను" అని పిల్చిమరీ సువర్ణరేఖ మామిడి పండు యిచ్చేది. యీ తోట నారెమ్మతోట అని పేరు పడినా, అసలు ఆ తోట డబీరోడిదట. ఈ డబీరోడే నారెమ్మ యింటికి తరచు వస్తుండేవాడు. వాడి యెదరగా నారెమ్మ నిల్చుంటే వాడి భుజానికి వుండేది. అంతపొడగరి వాడు. అయితే పొడుగుకు తగ్గ శరీరం వుండటం వల్ల అంత యెత్తుగా కనిపించేవాడు కాదు. వాడి జుత్తూ మీసాలవేపు యెంత సేపైనా చూసే వాడిని. గొర్తెపోతు కొమ్ముల్లా మీసాలు బుగ్గల మధ్య వరకూ ప్రాకి ప్రాకి వుండేవి. గేరా గిరజాలు. నారెమ్మ డబీరోడి కూతురే అనుకునేవాణ్ణి. కాదురా అనేసింది మా అమ్మ. కానీ వాళ్ళ వావి వరసలు చెప్పలేదు.

ఇక యీ గుళ్ళ చెట్టు క్రింద తరచు నిల్చొని కేకలు వేసినట్లు మాటాడేది కాంతిమ్మ. మాయమ్మ అత్తని పిల్చేదని నేనూ కాంతమ్మత్త అని పిల్చేవాణ్ణి. ఈ కాంతమ్మత్త ఐదుగురు అన్నదమ్ముల తరవాత పుట్టిన ఒకే ఆడబిడ్డ. పసుపు రాయకపోయినా బంగారం ఛాయతో వుండేది. బొట్టుపెట్టకపోయినా సూర్యునిలా ముఖం మెరిసిపోయేది. అసలు తండ్రి రూపు బిడ్డలందరిలోనూ యీ కూతురికే వచ్చిందనేవారు. తండ్రి రూపు వచ్చిన కూతురు అదృష్టవంతురాలంటారు. కానీ యీవిడ విషయంలో యీ నమ్మకం వమ్ము అయ్యింది. ఈ కాంతమ్మత్త అంటే ఐదుగురు కోడళ్ళకు సింహస్వప్నమే. ఇంట్లో గొడవలని యింట్లో పరిష్కరించేదికాదు. గుళ్ళచెట్టు క్రిందనిల్చొని అరుస్తూ అంతా బయట పెట్టేసేది. ఇంటి గుట్టేకాదు. వీధిగుట్టూ, వూరుగుట్టూ అన్నీ ఆ చెట్టు క్రిందే. వూరంతా వినిపించేటంత వాగ్ధాటితో కడిగి వదిలేసేది" చెట్టుమీద కాకిగోల చెట్టు కింద యీవిడ గోలేమిటని ? మాచిన్నతాత సీతయ్య పెళ్ళాం అమ్మడుందే ఒకసారి అనటం విన్నాను. ఈ అమ్మడు కవీశ్వరుని కూతురట. ఈవిడకీ, కవిత్వం అబ్బినట్లుంది. ఎప్పుడూ, వండుతున్నప్పుడు కూడాను యేవో పద్యాలు పాడుతుండేది. ఒకోసారి పద్యాలతోనే సమాధానం యిచ్చేది. ఆమెకు ఉపమానాలంకారం చాలా యిష్టమేమో ఇంతమంది గుళ్ళ చెట్టుక్రించ కూర్చునేవాళ్ళమా ! ఆవిడా కూర్చునేది కానీ సీతయ్యతాత పొరపాటున కూర్చున్నా కేకవేసి మరీ లాక్కుపోయేది. సీతయ్యతాత అంటే నాకు చాలా యిష్టం. ఎన్నెన్నో నాకు తినడానికి యిస్తుండేవాడు. ఒకసారి కోపంవచ్చి అమ్మడు అవ్వని 'తాత నెందుకలా లాక్కుపోతావని' అడిగేసాను. నా కోపం చూసి "మీ తాతలాగ నివ్వు పెద్దయ్యాక గుళ్ళ చెట్టుక్రింద కూర్చో, నీ పెళ్ళాం నిన్ను లాక్కుపోకపోతే ఒట్టు" అంది.నాకేం అర్థంకాక చూస్తుంటే-

"అక్కడ ఒక ఊర్వశి వుంది" అంది. అప్పుడు కూడా నాకేం అర్థం కాలేదు. ఆ తరవాత ఆవిడే రంభా, ఊర్వశి, మేనకల గురించి చెప్తేగాని యీ ఊర్వశి యెవరో తెలిసిందికాదు. ఇంతకీ

ఆ ఊర్వశిని ఆరోజు చూసినా నాకు యౌవనం వచ్చాక మాఅమ్మడు అవ్వ ఊర్వశి అన్న చెల్లా ముత్యాల్లాంటి ఆడది యెక్కడైనా తారస పడుతుందేమోనని వెతికాను. చెల్లా ముత్యాలు చెల్లాముత్యాలే. ఇంకో ముత్యాలు మరి పుట్టదు. పుట్టడానికి వీల్లేదు. యెప్పుడెదురైనా చివరకు నా మనుమడి యౌవనంలో యెదురైనా ముత్యాలు నిత్య యౌవని - ఊర్వశే. ముత్యాలు బైరాగి కోడలు. బైరాగి తత్త్వాలెంత మధురమైనవో యీమె అందం. అంతకన్నా మధురాతి మధురమైనది. వాడికున్న పుచ్చి జబ్బులు పెళ్ళానికి సోకనియ్యకండానే పోయాడా మొగుడు. పిల్లలులేరు. ఉన్న అన్న దమ్ముడు వృత్తి సోమరిపోతు. ఇంట్లో కూర్చొని దర్జాగా తింటానంటాడు.

ఒకసారి మా కాంతమ్మత్త యీ సోమరిపోతుకు సవాలు చేసింది. అక్కడ నించి అలాగ సిల్లంగి పెట్టినట్లు సూస్తావెందుకురా? ఈ చెట్టు కిందకు రారా.... గాలి తగిలి చల్లబడతావు. ఇలాంటివేవో కేకలు వేసింది. కాంతమ్మ నోటపడితే అన్యాయం కడిగి వదిలేస్తాదని వూర్లో వాళ్ళ నమ్మకం. పొరపాటునైనా ఒకరు వేలెత్తి చూపినట్లు మెసల్లేదు. నాలుగేళ్ళ వయసులో పెళ్ళి చేసారు. అత్తవారింటికి వెళ్ళే అవసరం లేకుండా తనకన్నా పాతికేళ్ళు పెద్ద అయిన మొగుడు గతించాడు. ఈ వూర్లో పుట్టినా యీవూర్లో బుగ్గవనురా అనేది. ఆమె యీ కనీసపు కోరిక తీరిందన్నట్లు మా పెద్దమ్మ యింటికి సహాయానికి నౌరంగపురం వెళ్ళి అక్కడ మూడురోజుల జ్వరానికే బుగ్గయిపోయింది. ఈవిడే ఒక లాయరుగా మలిచి వుంటే సంఘానికెంత వుపకారం జరిగేది ? పెళ్ళాడ్డానికి యెవరైనా ముందు కొస్తే యీ రూపాన్ని యెంతగా ఆ మగాడు ఆరాధించేవాడు ? ఈ అందమైన ప్రతి రూపాలు - ఆ తెలివైన మెదళ్లు యెన్నెన్ని సృష్టింపబడేవి ? ఇలా నేను యిప్పుడు అనుకున్నా ఆరోజుల్లో ఆమె, ఆమె బంధువర్గం యిలా తల్చుకునే ఆస్కారంలేదు. అందం వుంది. ఎందరైనా తోడేళ్ళలా వెంట పడగలరు. కోరికలను విత్తనాలలా జల్లలేదు. పిడికిల్లో పెట్టేసి యేదో ఒక ప్రధానమైనది- నవ్వులపాలు కాకుండా నిల్చున్నాను. మీ ఖాతరు నాకేంటంటూ! తన శీలాన్ని గర్వంతో కాపాడుకున్నది.

(ఇంకా వుంది)


## ALL INDIA FIGURAL CONTEST

రు. 1,50,000 బహుమతులు గెలవండి

(ప్రవేశ రుసుములేదు)

| | | |
|---|---|---|
| 16 | 17 | 12 |
| 11 | 15 | 19 |
| 18 | 13 | 14 |

| | | |
|---|---|---|
| 17 | 18 | 13 |
| 12 | 16 | 20 |
| 19 | 14 | 15 |

మొదటి బహుమతి : YEZDI మోటారు సైకిలు. రెండవ కన్సోలేషన్ బహుమతి. జపాన్ మోడల్ సోని టూ-ఇన్-వన్ రు. 175/- లకే పరస్పరం ప్రయోజన పథకం. మూడవ బహుమతి. నేషనల్ టేప్ రికార్డరు లేదా 500 నగదు. మొట్టమొదట వచ్చు ఎంట్రీకి రు. 101/- ప్రత్యేక బహుమతి ఇవ్వబడును. తెల్ల కాగితము మీద పైతెలిపిన నమూనాలో 9 ఖాళీ గదులను తయారు చేయండి. 12 నుండి 20 వరకు అంకెలను ఉపయోగించి పై గళ్ళను నిలువుగా అడ్డముగా మూలలుగా ఎటు చూసినా 48 వచ్చేటట్లు నింపండి. గెలుపొందిన వారు గెలిచిన బహుమతి పంపుటకు పోస్టేజి మరియు ప్యాకింగు చార్జీలు కట్టవలెను. ఎంట్రీలు ఇంగ్లీషులో / హిందీలో పంపవలెను. ఈ ప్రకటన ప్రచురించిన తేదీనుండి 10 రోజుల లోపు పంపవలెను.

M/s. MAHARANI SALES (INDIA).
Gokalpur Delhi - 110094.